ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 12.03.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ముగిసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

2. నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ ప్రొడక్షన్, ఇన్నోవేషన్ స్టూడియో... ఐలైన్ స్టూడియోస్ ను హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ప్రారంభించారు.

3. గడిచిన 12 ఏళ్లలో తెలంగాణ రైతులు పండించిన దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల విలువైన వరి ధాన్యాన్ని, 70 వేల కోట్ల రూపాయల విలువైన పత్తిని కనీస మద్దతు ధర చెల్లించి కేంద్రం సేకరించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలియజేశారు.

4. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో కొత్తగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాల్లో పలువురు మంత్రులు ఈరోజు దిశా నిర్ధేశం చేశారు.

-------------------------

**ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు**

తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ముగిసినట్లు ధర్మాసనం ప్రకటించింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై స్పీకర్ తన తీర్పును వెల్లడించారని న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు వివరించారు. ఈ వాదనలతో ఏకీభవించిన అత్యున్నత న్యాయస్థానం.. విచారణను

ముగించింది. అయితే, తమకు తీర్పు కాపీలు అందలేదని బీఆర్ఎస్ లాయర్ కోరగా, రెండు రోజుల్లోగా కాపీలను పిటిషనర్లకు అందజేయాలని స్పీకర్‌ను ధర్మాసనం ఆదేశించింది. అలాగే, ఈ కేసుకు సంబంధించిన పూర్తి ఆధారాలు, వివరాలను నాలుగు రోజుల్లో సమర్పించాలని స్పష్టం చేసింది.

**పీటీసీ - హైదరాబాద్**

-----------------------

**నెట్‌ఫ్లిక్స్**

నెట్‌ఫ్లిక్స్ తన గ్లోబల్ ప్రొడక్షన్, ఇన్నోవేషన్ స్టూడియో... ఐలైన్ స్టూడియోస్ ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఇది దేశంలో నెట్‌ఫ్లిక్స్ పరిధిని మరింత విస్తరించడమే కాకుండా.. యానిమేషన్, గేమింగ్, తదితర రంగాలకు సంబంధించి దీర్ఘకాలిక పెట్టుబడిగా నిలువనుంది.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. సృజనాత్మక సాంకేతికతలు, దృశ్య శ్రవ్య కథన రీతులు, డిజిటల్ వినోద రంగాలకు కేంద్రంగా హైదరాబాద్ ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందన్నారు.

**బైట్ సంజయ్ జాజు**

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని వ్యాఖ్యానించారు.

**బైట్ ముఖ్యమంత్రి**

**డెస్క్**

-----------------------

**కిషన్ రెడ్డి**

తెలంగాణ రైతులు పండించిన ఒక లక్షా 25 వేల 855 మెట్రిక్ టన్నుల పప్పుధాన్యాలు, నూనెగింజలను.. 894 కోట్ల రూపాయలకు పైగా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతులకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర వ్యయసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. 2014 నుంచి.. ఇప్పటివరకు  తెలంగాణ రైతులు పండించిన దాదాపు  2 లక్షల కోట్ల రూపాయల విలువైన వరి ధాన్యాన్ని, 70 వేల కోట్ల రూపాయల విలువైన పత్తిని కనీస మద్దతు ధర చెల్లించి కేంద్రం సేకరించిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు.

**జీఎస్**

--------------------------

**గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా**

రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల  యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని ఈ రోజు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గవర్నర్‌కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి భావానీ శంకర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆలయ సంప్రదాయంతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

**పీటీసీ – యాదాద్రి భువనగిరి**

-------------------------

**కేటీఆర్ లేఖ**

తెలంగాణలో వాణిజ్య, గృహ అవసరాల ఎల్‌పీజీ సిలిండర్ల కొరత తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి కార్యానిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి లేఖ రాశారు. గ్యాస్ కొరత వల్ల హోటళ్లు, హాస్టళ్లు, చిన్న తరహా ఆహార వ్యాపారాలు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించడానికి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.

**డెస్క్**

---------------------------

**ఆస్తి పన్ను**

2025-26 సంవత్సరంకు గానూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెండింగ్ లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలు ఈ నెల 31 వ తేదీలోగా చెల్లించి ఓటీఎస్ పథకం కింద వడ్డీపై 90 శాతం రాయితీ పొందాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

**డెస్క్**

----------------------------

**స్పీకర్**

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ లో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్ లకు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.

**పీటీసీ – వికారాబాద్**

------------------------------

**మంత్రి సీతక్క**

ములుగు జిల్లా ఇంచెర్లలో జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులు,మున్సిపల్ కౌన్సిలర్ల శిక్షణ

తరగతులను మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ...

**బైట్ సీతక్క**

అలాగే మహబూబాబాద్ జిల్లాలో జరిగిన ప్రజా ప్రతినిధుల అవగాహన సదస్సును మంత్రి ప్రారంభించారు.

**పీటీసీ – ములుగు, మహబూబాబాద్**

---------------------------

**మంత్రి దామోదర**

పంచాయతీ, మున్సిపల్ చట్టాలపై అవగాహన ఏర్పాటు చేసుకొని పరిపాలన దక్షత చాటాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డిలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక ద్వారా కొత్త ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ...

**బైట్ మంత్రి దామోదర**

ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లాలోని నర్సింగ్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సును మంత్రి ప్రారంభించారు.

**పీటీసీ - సంగారెడ్డి**

------------------------

**కొండా సురేఖ**

గ్రామాల అభివృద్ధే ప్రగతికి పునాది అని అటవీ శాఖ మంత్రి  కొండా సురేఖ అన్నారు. వరంగల్ జిల్లా మరియాపురంలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.  ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సర్పంచ్ నుంచి మంత్రి వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**పీటీసీ – వరంగల్**

---------------------------

**చిన్నారెడ్డి**

ప్రభుత్వం విద్య,వైద్యం,ఆరోగ్యం,క్రీడా రంగాల పై ప్రత్యేక శ్రద్ధ సారిస్తూ బలోపేతం దిశగా పాటిష్ట చర్యలు చేపడుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. ఈరోజు వనపర్తిలో 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్ లు, గ్రామసర్పంచి, ఉపసర్పంచులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ......

బైట్ **చిన్నారెడ్డి**

**పీటీసీ - వనపర్తి**

------------------------------

**కోమటిరెడ్డి**

ప్రజలతో సన్నిహిత సంబంధాలే ప్రజాప్రతినిధులను మళ్లీ గెలిపిస్తాయని, అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజలతో సమన్వయం కావాలని, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిదులకు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దిశా నిర్ధేశం చేశారు. ఈ రోజు నల్గొండ జిల్లాలో మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడూతూ... తమ పదవిని హోదా అనుకోవద్దని, బాధ్యతగా భావించాలని సూచించారు.

**డెస్క్**

--------------------------

**వాకిటీ**

బాపుజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం కృషి చేయాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు లో భాగంగా ప్రజా పాలన ప్రగతి

ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ రోజు నారాయణపేట జిల్లాలోని ప్రజాప్రతినిధులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో 272 మంది సర్పంచులు 72 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు. వారికి మంత్రి దిశా నిర్దేశం చేశారు.

డెస్క్

------------------------------

**మినీ ట్రాక్టర్లు**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు మినీ ట్రాక్టర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,రైతులు ఆధునిక పద్ధతులు, యంత్రాలను వినియోగించి సాగు ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యాన రంగాల అభివృద్ధికి యాంత్రీకరణ ఎంతో అవసరమన్నారు.

**పీటీసీ - సంగారెడ్డి**

----------------------------

**పొన్నం**

హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ తో ప్రొఫెసర్ కోదండరాం ,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ లు సమావేశం అయ్యారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు కమిటీ ఏర్పాటు పై చర్చించారు. కమిటీలో అన్ని వర్గాలకు అవకాశం ఇచ్చేలా చూడాలని ప్రాథమికంగా నిర్ణయించారు. జిల్లాల వారిగా అర్హులను గుర్తించి ఉద్యమకారుల డిమాండ్ లను అధ్యయనం చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

డెస్క్

------------------------------